క్లుప్తంగా

మండల సమాఖ్య అధ్యక్షురాలికి సన్మానం



మండల సమాఖ్య అధ్యక్షురాలు సునీతను సన్మానిస్తున్న సభ్యులు

పులిచెర్ల(కల్లూరు): జిల్లాలో పులిచెర్ల మండల సమాఖ్య ఉత్తమ సమాఖ్యగా ఎంపికై ఆగస్టు 15న ప్రాజెక్ట్ డైరెక్టర్ తులసి చేతులమీదుగా సమాఖ్య అధ్యక్షురాలు సునీత ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సమాఖ్య కార్యాలయంలో ఆమెను కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఏపీఎం చంద్రమోహన్, సీసీలు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి వాసవి క్లబ్ సాయం



విద్యార్థినికి నగదు అందజేస్తున్న ఉషారాణి

పలమనేరు: పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న శ్వేత ఫీజు కట్టలేకపోయిందనే విషయం తెలుసుకున్న స్థానిక వాసవి క్లబ్ ఆఫ్ వనిత నిర్వాహకులు ఆర్.ఉషారాణి రూ.8వేలను ఆ విద్యార్థినికి అందజేశారు. దీంతో శ్వేత ఆమెకు కృతజ్ఞతలు తెలిపింది.

భగవద్గీత అనుసరణీయం



భగవద్గీత పంపిణీ చేస్తున్న నిర్మలానంద

సదుం: మానవులకు భగవద్గీత చూపిన మార్గం అనుసరణీయమని చిన్మయ మిషన్‌కు చెందిన నిర్మలానంద అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భగవద్గీత సారంపై గురువారం ఆధ్యాత్మిక సందేశమిచ్చారు. భగవద్గీత చదివి అర్థం చేసుకుంటే జీవితం ధన్యమవుతుందన్నారు. నిత్యం విద్యార్థులు భగవద్గీతను పఠించాలన్నారు. అనంతరం విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు.

ఎస్‌ఐ శ్రీనివాస్‌కు వీడ్కోలు



ఎస్‌ఐకు వీడ్కోలు పలుకుతున్న సిబ్బంది

రామకుప్పం: రామకుప్పం ఎస్‌ఐ శ్రీనివాస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. దీంతో ఆయన గురువారం ఇక్కడి పోలీస్‌స్టేషను నుంచి రిలీవ్ అయ్యారు. హెడ్ కానిస్టేబుల్ మురళి, సిబ్బంది ఆయనకు వీడ్కోలు పలికారు.

ప్రత్యేక అవసరాల పిల్లల పాఠశాల తనిఖీ



ప్రత్యేక అవసరాల పిల్లల పాఠశాల తనిఖీ చేస్తున్న ఎంఈఓ లీలారాణి

పలమనేరు: పట్టణంలో బొమ్మిదొడ్డి రోడ్డులోని ప్రత్యేక అవసరాల పిల్లల పాఠశాలను పలమనేరు ఎంఈఓ లీలారాణి గురువారం తనిఖీ చేశారు. అక్కడ పిల్లలకు పెడుతున్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లల హాజరు శాతం బాగుందని, వారికి క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ గీత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కామధేనువుపై శ్రీకృష్ణుడు



పుత్తూరు రూరల్: శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి వార్లకు అభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టుపీతాంబరాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ద్రౌపదీదేవి జన్మస్థలమైన చౌటూరు గ్రామానికి ఊరేగింపుగా వెళ్లారు. వన్నియ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు అమ్మవారిని భక్తిప్రవర్తులతో పూజించి, సారెను సమర్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం యాదవ సంఘ ఆధ్వర్యంలో శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ భగవానుడు కామధేనువుపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

‘కౌండిన్య’లో చిరుతల సంచారం!

- రెండేళ్ల క్రితం గంకొండ అడవిలో మృతి చెందిన ఓ చిరుతపులి
- ఏడాది క్రితం ఎర్రాంగళ్‌లో ఇంటిలోకి వెళ్లి కుటుంబీకులపై దాడి
- ఇటీవల అడవిలో మృత్యువాత పడుతున్న ఆవులు, దూడలు, మేకలు
- అటవీశాఖ గణించిన వన్యప్రాణుల పాదపు లెక్కలపై అయోమయం



గంకొండ అడవిలో మృతిచెందిన చిరుతపులి(ఫైల్),



మోర్ధనలో సంచరిస్తున్న లెపార్డ్ (ఫైల్)

పలమనేరు: ఏనుగులకు నిలయమైన కౌండిన్య అభయారణ్యంలో ఇప్పుడు చిరుతల సంచారం అటవీ ప్రాంత గ్రామాలకు ఆందోళన కలిగిస్తోంది. నెల వ్యవధిలో పలమనేరు ఫారెస్ట్ రేంజి పరిధిలో రెండు దూడలు, ఒక మేక క్రూరమృగాల బారిన పడి మృతిచెందాయి. అయితే దూడలను చంపింది చిరుతలు కాదని.. హైనాలని స్థానిక అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి మూడేళ్ల క్రితం వేటగాళ్ల ఉచ్చులో పడి ఓ చిరుత ఆపై మృతి చెందింది. రెండేళ్ల క్రితం పెద్దపంజాణి మండలంలో మరో చిరుత మృతి చెంది కనిపించింది. ఏడాది క్రితం కౌండిన్య అభయారణ్యానికి పది కిలోమీటర్ల దూరంలోని తమిళనాడు మోర్ధన ఫారెస్ట్‌లోని ఎర్రాంగళ్‌లోని ఓ ఇంట్లోకి వెళ్లిన చిరుత కుటుంబీకులను గాయపరిచింది. దీనిపై అటవీశాఖ సరైన వివరాలను వెల్లడించలేదు. ఈ పరిణామాల నేపథ్యంలో కౌండిన్య అటవీ ప్రాంత సమీప గ్రామాల్లో చిరుతల సంచారంపై ప్రజల్లో ఆందోళన మొదలైంది.

చిరుతలు ఉన్నట్టేనా?

కౌండిన్య అభయారణ్యానికి ఆనుకుని పలమనేరు నియోజకవర్గంలోని మండిపేట కోటూరు, చెత్తపెంట, ఊసరపెంట, కాలువపల్లె, తిమ్మయ్యగారిపల్లె, వెంగంవారిపల్లె, తోటకనుమ, కైగల్, గాంధీనగర్, జగమర్ల ఉన్నాయి. బంగారుపాళెం మండలం కీరమంద, టేకుమంద తమిళనాడు రాష్ట్రానికి చెందిన సైనగుంట్ల, అరవట్ల, మోర్ధన, గుండ్లపల్లె, జిట్టిపల్లె, ధనకొండపల్లె, జంగాలపల్లెలున్నాయి. ఇక పెద్దపంజాణి, సోమల మండలాల్లోని అడవులు కౌండిన్యకు సమీపంలోనివే. కౌండిన్య అభయారణ్యంలో 93 ఏనుగులు గుంపులుగా సంచరిస్తుంటాయి. ఏడాది క్రితం కౌండిన్యకు దక్షిణంగా ఉన్న తమిళనాడు గ్రామం ఎర్రాంగళ్‌లో ఓ ఇంటిలోకి వెళ్లిన చిరుత అక్కడ ముగ్గురిని గాయపరిచింది. గతంలో కడతట్లపల్లె వద్ద ఓ పశువును చిరుత చంపేసిందని పశువుల కాపరి తెలిపాడు. అదే విధంగా గాంధీనగర్‌లో అడవిలోనూ మేతకెళ్లిన ఓ పాడిఆవు బలైంది. పలమనేరు-గుడియాత్తం అటవీమార్గంలోని సైనిగుంట వద్ద చిరుతను చూశామని ఆ మార్గంలో వెళ్లిన పలువురు వాహనచోదకులు చెప్పారు. రెండేళ్ల క్రితం పెద్దపంజాణి మండలంలోని గంకొండ అటవీ ప్రాంతంలో మేకలను తింటున్న చిరుత కారణాలు తెలియకుండా మృతిచెందిన విషయం తెలిసిందే. మూడేళ్ల క్రితం బంగారుపాళెం అడవుల్లో ఓ చిరుత వేటగాళ్ల ఉచ్చులోపడి మృతి చెందింది. దీన్ని బట్టి చూస్తే ఇప్పటికే రెండు చిరుతలు మృతి చెందగా, మరో నాలుగు చిరుతలు కౌండిన్యలో సంచరిస్తున్నట్టు తెలుస్తోంది. ఇవే కాకుండా పదిదాకా హైనా(దుమ్ములగొండి)లున్నట్టు తెలుస్తోంది. రోజుకు 60 కిలోమీటర్ల పరిధిలో ఒంటరిగా సంచరిస్తూ చిరుతలు వేటాడి వదిలేసిన జంతువుల కళేబరాలను హైనాలు పీక్కుతింటూ ఉంటాయి.

అటవీ సమీప గ్రామాలకు తప్పని టెన్షన్

కౌండిన్య అడవిలో చిరుతలు, హైనాలు సంచరిస్తుండడంతో అటవీ సమీప గ్రామాలకు టెన్షన్ తప్పడం లేదు. ముఖ్యంగా పొలాలవద్ద ఇళ్లలో కాపురాలుండేవారు, అడవిలోకి పశువులు, మేకలను మేతకు తోలుకెళ్లేవారు ఆందోళన చెందుతున్నారు.

చిరుతలే లేనప్పుడు ఇక్కడ ఎలా మృతిచెందాయి?

కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చురిలో ఏనుగులు తప్పితే చిరుతలు లేనప్పుడు బలిజపల్లె వద్ద, గంకొండ వద్ద మృతి చెందిన చిరుతలు ఎక్కడినుంచి వచ్చాయనేది అటవీశాఖే తేల్చాల్సి ఉంది.

ఏనుగులుంటే పులులు ఉండవు



కొన్నాళ్లుగా రేంజి పరిధిలో మృతి చెందిన ఆవులు, దూడలను చంపించి చిరుతలు కాదు హైనాలే. కౌండిన్యలో కేవలం హైనాలు మాత్రమే సంచరిస్తున్నాయి. కానీ మృగాలకు హద్దులంటూ ఉండవు కాబట్టి చిరుతలు, చీతాలు కౌండిన్యలోకి వచ్చి వెళ్లి ఉండే అవకాశం ఉంది. ఇటీవల కౌండిన్యలో వన్యప్రాణులు, మృగాల ఘటనలోనూ పులులున్నట్టు సమాచారం లభించలేదు.

–శివన్న, ఎఫ్ఆర్వో, పలమనేరు రేంజి

నోడల్ అధికారులతో కమిషనర్ సమీక్ష



నోడల్ అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్

పలమనేరు: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2024కు సంబంధించి ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ గురువారం నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 21 వరకూ మున్సిపాలిటీలో నిర్వహించే ఇంటింటి ఓటర్ల సర్వేపై సమీక్షించారు. ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. ఓటర్ల నమోదు ప్రత్యేక అధికారి నవీన్‌కుమార్, నోడల్ అధికారులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఆర్టీసీ దుకాణాల వేలం

కుప్పం: స్థానిక ఆర్టీసీ డిపో ప్రాంగణంలోని 17 ఖాళీ దుకాణాలను వేలం వేయనున్నట్లు డిపో మేనేజర్ పెంచలయ్య తెలిపారు. ఆర్టీసీకి చెందిన ఖాళీ స్థలాలు, కమర్షియల్ కాంప్లెక్స్ అద్దెల కోసం టెండర్ల ద్వారా ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, 26న దరఖాస్తుల సమక్షంలో టెండర్లు పరిశీలిస్తారన్నారు.

సస్య రక్షణలతో మామిడిలో అధిక దిగుబడి

- జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్ రెడ్డి



రొంపిచెర్ల : రైతులకు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి

రొంపిచెర్ల/పులిచెర్ల(కల్లూరు): మామిడి తోటల పెంపకంలో సస్య రక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్ రెడ్డి అన్నారు. మామిడి తోటల పెంపకంపై గురువారం రొంపిచెర్ల-1 రైతు భరోసా కేంద్రం, పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయంలో రైతులకు ×మామిడి కోతల అనంతరం యాజమాన్య పద్ధతులు¥ అనే అంశంపై ఒక రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, మామిడి కాయలు కోసిన 20 రోజుల తర్వాత చెట్లలో ఎండిన కొమ్మలతోపాటు గుబురుగా ఉన్న కొమ్మలను కత్తిరించి, చెట్టు అంతటా వెలుతురు బాగా ప్రసరించేలా చేయాలన్నారు. అలాగే పూత బాగా నిలబడడానికి అర్కా మాంగో అనే మందును ఒక లీటర్ నీటికి 8 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా ఎరువులు వేయాలన్నారు. కార్యక్రమంలో రొంపిచెర్ల జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, పులిచెర్ల ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, శాస్త్రవేత్తలు రెడ్డిరాం, రాఘవేంద్ర తదితరులు మాట్లాడారు. ఉద్యానవన శాఖాధికారి సంతోషికుమారి, మండల వ్యవసాయాధికారులు సుధారాణి, శ్రీనివాసులు, రైతు భరోసా కేంద్రం ఇన్‌చార్జ్‌లు సుజాతమ్మ, శ్రావణి, వెంకటరమణ నాయక్ పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరానికి స్పందన



దూడలకు మందు వేస్తున్న సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మతుకువారిపల్లెలో గురువారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. దాదాపు 120 పశువులను పరీక్షించారు. నట్టలు, పిడుదల నివారణకు మందులు పిచికారీ చేశారు.దూడలకు నోటి పుండు రాకుండా మందులు వేశారు. పశువైద్యాధికారి డాక్టర్ మునిచంద్ర, స్థానిక సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి , పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మళ్లీ రికార్డు సృష్టిద్దాం



కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి

పుంగనూరు: మున్సిపాలిటీలో చేస్తున్న అభివృద్ధి పనులు, కార్యక్రమాలతో జాతీయ స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలలో రికార్డు సృష్టించేందుకు సమష్టి కృషితో ముందుకుపోవాలని, దీనికి ప్రజలు కూడా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలలో ప్రతిసారీ రికార్డు సృష్టిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ పర్యాయం మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, పాలక మండలి, సిబ్బంది సహకారంతో పలు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా పారిశుధ్యం, రహదారుల శుభ్రం, ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ, హోం కంపోస్ట్ తయారీ, వీధుల్లో మొక్కలు పెంపకం, మురుగుదొడ్ల నిర్వహణ, బహిరంగ మలమూత్ర విసర్జన నిషేధం కార్యక్రమాల గురించి విస్తృత ప్రచారం చేసి, ప్రజలలో చైతన్యం తెచ్చినట్టు చెప్పారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా ప్రజల నుంచి సమాచారం సేకరిస్తోందని, దీనిని దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రజలు ఇందులో భాగస్వామ్యులై, కార్యక్రమాల అమలుపై సమాచారమిచ్చి, మున్సిపాలిటీని దేశస్థాయిలో అగ్రస్థానంలో నిలిచేలా సహకరించాలని కోరారు.

ఇమామ్,మౌజాన్ల ఆర్థిక సాయానికి రెన్యూవల్



మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్, మౌజన్లకు చేయిస్తున్న రెన్యూవల్స్

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని మసీదుల ఇమామ్, మౌజాన్లకు ప్రభుత్వం నుంచి అందే సాయానికి సంబంధించి గురువారం పట్టణంలోని పలు మసీదుల్లో గురువారం రెన్యూవల్స్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి నేతృత్వం వహించిన పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జాఫర్ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ఐదు మండలాలు, స్థానిక మున్సిపాలిటీలో మొత్తం 280 మసీదులున్నాయన్నారు. ఇందులో ఉలేమా, ఇమామ్, మౌజాన్, మసీదు కమిటీ సభ్యులుంటారన్నారు. వీరిసేవలకు ప్రభుత్వ ఆర్థిక సాయం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. పలువురు మసీదు పెద్దలు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న జెడ్పీటీసీ నితిన్ రెడ్డి

రామకుప్పం: మండలంలోని బందార్లపల్లె పంచాయతీ బగళనత్తంకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త విజయ్ కుమార్(బీరప్ప) అనారోగ్యంతో మృతి చెందారు. చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ ఆదేశాలతో జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ రాజ్‌గోపాల్ మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియలకు రూ.10 వేలను అందజేశారు. కార్యక్రమంలో కుప్పం ఏఎంసీ డైరెక్టర్ సురేంద్రరెడ్డి,ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, నాగరాజు రెడ్డి,వార్డు సభ్యులు వెంకటరమణ రెడ్డి, సంపంగి రెడ్డి, మంజునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరికి రిమాండ్



నిందితులను రిమాండుకు తరలిస్తున్న పోలీసులు

చౌడేపల్లె: వేర్వేరు కేసుల్లో ఇద్దరిని రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ రవికుమార్ గురువారం తెలిపారు. ఆయన కథనం... పులిచెర్ల మండలం చింతలవారిపల్లెకు చెందిన పి.ఆనంద్‌కు మండలంలోని నూనెముద్దనపల్లెకు చెందిన మౌనికతో వివాహమైంది. భర్తపై మౌనిక ఫిర్యాదు మేరకు 2018లో వరకట్నం కేసు నమోదైంది.

–అలాగే మరో కేసుకు సంబంధించి చౌడేపల్లె మండలం చారాల వద్ద 2020 లో నాటుబాంబు పేలిన ఘటనలో జి. హరిపై కేసు నమోదైంది. ఆనంద్, హరి ఇద్దరూ కోర్టు వాయిదాలకు హాజరు కాకపోవడంతో పుంగనూరు న్యాయమూర్తి వారిపై అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో వారిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు.

కవాతులో కస్తూర్బా స్కౌట్స్ విద్యార్థినుల ప్రతిభ



మంత్రి ఉషశ్రీతో కస్తూర్బా స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థినులు

రామకుప్పం: స్వాతంత్ర్య దిన వేడుకల సందర్భంగా మంగళవారం చిత్తూరు జిల్లా పోలీస్ గ్రౌండ్‌లో నిర్వహించిన కవాతులో తమ స్కూలు స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రథమ బహుమతి సాధించారని రామకుప్పం కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ అమరావతి తెలిపారు. రాష్ట్ర మహిళా-శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ, కలెక్టర్ షణ్మోహన్, జిల్లా సూపరింటెండెంట్ రిషాంత్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థినులు ప్రథమ బహుమతిని అందుకున్నారని ఆమె చెప్పారు. వారిని ప్రిన్సిపల్‌తోపాటు పీఈటీ సంధ్య, టీచర్లు అభినందించారు.

వైభవంగా బండి కుంభం

తవణంపల్లె: మండలంలోని ముట్టుకూరులో ద్రౌపదీసమేత ధర్మరాజుల గుడిలో జరుగుతున్న మహా భారత యజ్ఞంలో భాగంగా గురువారం బకాసురుని బండి కుంభం వైభవంగా నిర్వహించారు. కళాకారుడు సురేష్ భీముడి వేషధారణలో గ్రామాల్లో తిరిగి బకాసురునికి ఆహారం సేకరించారు. గ్రామాల్లో భక్తులు భీమునికి ఆహారం ఇచ్చి పంపారు. రాత్రి తమిళ నాటక ప్రదర్శన ప్రారంభమైంది.

అభివృద్ధి పనులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

చిత్తూరు అర్బన్: నగరంలో పలు అభివృద్ధి పనులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. నగర మేయర్ ఎస్.అముద ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అజెండా రూపొందించిన అంశాలపై చర్చించి ఆమోదించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి పిలిచిన టెండర్లను తక్కు మొత్తం కోట్ చేసిన కాంట్రాక్టర్లకు అప్పగించడం, 14 విలీన పంచాయతీల్లో తాగునీటి బోరు మోటర్ల నిర్వహణకు, అత్యవసర మంచి నీటి సరఫరా దృష్ట్యా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, అమృత్ పథకం కింద సైతం పిలిచిన టెండర్లకు స్టాండింగ్ కమిటీ ఆమోద ముద్ర వేసింది. ఇదలా ఉంచితే, కార్పొరేషన్‌లోని ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు (ఈఎస్‌ఐ)హెల్త్ కార్డులు అందజేశారు. మునిసిపల్ కార్యాలయంలో మేయర్ అముద, కమిషనర్ అరుణ చేతులమీదుగా వీటిని పంపిణీ చేశారు.

గుండ్లసాగరంలో ‘నాభూమి-నాదేశం’

గుడుపల్లె: గ్రామాలలో పచ్చదనం పెంపునకు కృషి చేస్తే అందరూ ఆరోగ్యవంతులుగా ఉండటమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు దోహదం చేసినవారవుతారని ద్రవిడ వర్సిటీ రిజిస్ట్రార్ వేణుగోపాల్‌రెడ్డి, రెక్టార్ అనురాధ తెలిపారు. గురువారం మండలంలోని గుండ్లసాగరంలో నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం నిర్వహించింది. గ్రామ రైతు భరోసా కేంద్రం, సచివాలయంతో పాటు ఖాళీ ప్రదేశాలలో వలంటీర్లతో కలిసి మొక్కలు నాటారు. ఇంటింటికీ వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. రిజిస్ట్రార్, రెక్టార మాట్లాడారు. గుండ్లసాగరం గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించి, చెట్లు అయ్యేలా చూడాలని కోరారు. గ్రామం చుట్టు చెట్లు ఉంటే మంచి వాతావరణం ఉంటుందన్నారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, ఎఫ్ఆర్ఓ వైసీ రెడ్డి, డీఆర్ఓ మదన్ మోహన్, వర్సిటీ డీన్ వల్లూరి లోకనాథ్ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ యశోద, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

యూనిఫాం చీరల పంపిణీ



అంగన్‌వాడీ వర్కర్లకు యూనిఫాం చీరలను అందజేస్తున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల ఐసిడీఎస్ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు యూనిఫాం చీరలను ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. మొత్తం 90 మందికి రెండు చీరల చొప్పున ఇచ్చారు. అలాగే కిచెన్ గార్డెన్ వేయడానికి కూరగాయల విత్తనాల కిట్లను కూడా అందజేశారు. సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రమాదేవి, సర్పంచ్ రాణెమ్మ, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నాగరాజ ప్రసాద్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లకు యూనిఫాం పంపిణీ



యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం సీడీపీఓ మాధవి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు యూనిఫాం, కూరగాయల విత్తనాలను ఎంపీపీ యువరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఖాళీ ప్రదేశాలలో కూరగాయల విత్తనాలతో కిచెన్ గార్డెన్స్ పెంచాలని అంగన్‌వాడీ టీచర్లకు సీడీపీఓ సూచించారు.

పాడి రైతులు ఆర్థికంగా ఎదగాలి

వి.కోట: పాడి రైతులు దళారీల చేతుల్లో మోసపోకుడదనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమూల్ డెయిరీ ద్వారా రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎంపీపీ యువరాజు అన్నారు. గురువారం మండలంలోని కుంభార్లపల్లె రైతు భరోసా కేంద్రం వద్ద వి.కోట డీడీసీ బ్యాంక్ రుణమేళా కార్యక్రమం నిర్వహించింది. ముఖ్య అతిథిగా ఎంపీపీ మాట్లాడారు. జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో డెయిరీకి పాలు పోసే పాడి రైతులకు డీసీసీ బ్యాంకు 66 పైసల వడ్డీకే రూ.30,000 నుంచి రూ.75,000 వేల వరకు లోన్లు ఇస్తున్నట్టు చెప్పారు. అలాగే లీటరు పాలకు రూ.30 నుంచి రూ.70 రూపాయలను నాణ్యత బట్టి చెల్లిస్తోందన్నారు. రైతులు ప్రైవేటు డెయిరీలను నమ్మి మోసపోరాదని, అమూల్ డెయిరీకి పాలు పోసి అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అధికారులు రవిచంద్ర, రజని, కుమార్, బ్రహ్మానందం రెడ్డి, బ్యాంక్ మేనేజర్, చైర్మన్ శ్రీరాములరెడ్డి, ఏపీఎం సుబ్రమణ్యం, ఎంపీటీసీ మురుగేష్, పాడి రైతులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు

- చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- ఘనంగా మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



సావిత్రమ్మ కళాశాలలో బంగారు పతకాలు పొందిన విద్యార్థినులతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు ఇష్టపడి చదివితేనే మంచి ఫలితాలు సాధించగలరని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. స్థానిక సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల 41వ వార్షికోత్సవాన్ని ప్రిన్సిపల్ మనోహర్ అధ్యక్షతన గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థినులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. వివిధ రంగాల్లో స్థిరపడి రాణిస్తున్న మహిళలను స్ఫూర్తిగా తీసుకుని, మంచి ఫలితాలు సాధించి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి సంవత్సరం 10 గ్రూపుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు స్వర్ణపతకాలు ప్రదానం చేశారు. కళాశాల సీపీడీసీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి మాట్లాడుతూ 1982లో ప్రారంభమైన సావిత్రమ్మ కళాశాల అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ ప్రస్తుతం నాక్-ఏ గ్రేడ్ సాధించిన తొలి మహిళా కళాశాలగా నిలవడం ఆనందకరమన్నారు. పీవీకేఎన్ ప్రిన్సిపల్ డాక్టర్ జీవనజ్యోతి, సీపీడీసీ మెంబర్ డాక్టర్ కె.రామలక్ష్మి మాట్లాడారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. విద్యావంతులైన మహిళలు ఉంటేనే కుటుంబం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అనంతరం 2021-22లో అత్యధిక మార్కులు సాధించిన 10 మంది విద్యార్థినులకు బంగారు పతకాలు (8 గ్రాములు), ప్రస్తుత విద్యా సంవత్సరంలో చదువుతున్న డిగ్రీ విద్యార్థినులు 25 మందికి ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఉషారాణి, తిరుకుమరన్, షమ్స్ అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

కట్టమంచి చెరువు పరిశీలన



కట్టమంచి చెరువును శుభ్రం చేస్తున్న సిబ్బంది

చిత్తూరు అర్బన్: కట్టమంచి చెరువులో చేపలు మృతి చెందడంపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ జె అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. కట్టమంచి చెరువుకు వద్దకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. మృతి చెందిన చేపలను త్వరగా తొలగించాలని, దుర్వాసన రాకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లాలని అధికారులను ఆదేశించారు. చేపలు ఎందుకు మృతి చెందాయో విచారణ చేసి కారణాలు తెలుసుకుంటామన్నారు. మత్స్య శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆమె చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్తాఫీసర్ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, సిబ్బంది పాల్గొన్నారు.